

గరిడేపల్లి : పానుగోడులో పాదయాత్ర ప్రారంభిస్తున్న మాజీ మండలాధ్యక్షుడు అరవిందరెడ్డి, ఎంపీటీసీ వెంకటరమణ

## ఎమ్మెల్యే సైదిరెడ్డి గెలుపును కోరుతూ పాదయాత్ర

గరిడేపల్లి, నవంబర్ 25 : హుజూర్‌నగర్ ఎమ్మెల్యేగా శానంపూడి సైదిరెడ్డి మరోమారు గెలువాలని కోరుతూ మండలంలోని పానుగోడు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నియోజక వర్గ యూత్ నాయకుడు అనంతు కరుణాకర్, రాం మధు, పంగ నాగయ్య, నందిపాటి నర్సింహ స్థానిక కోదండ రామాలయం నుంచి ఎర్రవరంలో గల బాల ఉగ్ర నర్సింహ ఆలయం వరకు శనివారం పాదయాత్ర చేపట్టారు. బీఆర్ఎస్ మాజీ మండలాధ్యక్షుడు జోగు అరవిందరెడ్డి, ఎంపీటీసీ మేళ్లచెరువు వెంకటరమణ, మండల అధికార ప్రతినిధి రాం సైదులు వారికి పూలమాలలు వేసి పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పానుగోడు గ్రామాన్ని దత్తత తీసుకుని వేల కోట్లతో అభివృద్ధి చేసిన ఎమ్మెల్యేకు గ్రామస్తులంతా అండగా నిలువాలని కోరారు. పాదయాత్రకు పలు గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో యల్లావుల గురుమూర్తి, ముచ్చపోతుల కృష్ణ, బెక్కం విజయ్, మచ్చ మురళి, అత్తి మధు, సతీశ్‌గౌడ్, ఆదూరి భరత్, పానుగోడు గ్రామ అధ్యక్షుడు చామకూరి అంజి, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## కార్తీక పౌర్ణమికి మట్టపల్లిలో ఏర్పాట్లు



ముస్తాబైన ఆలయం

మఠంపల్లి, నవంబర్ 25 : మండలంలోని మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. 26న ఆదివారం మధ్యాహ్నం నుంచి 27 వరకు కార్తీక పౌర్ణమి సందర్భంగా పార్వతీరామ లింగేశ్వర స్వామి కల్యాణం, జ్వాలా తోరణం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 27న తెల్లవారుజామున 5 గంటలకు కార్తీక స్నానాలు, కృష్ణా నదిలో దీపాలు వెలిగించుటకు భక్తులకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఆయన వెంట పాలక మండలి సభ్యులు కుమ్మరికుంట్ల వెంకటనారాయణ, కంబాల రామయ్య, ఏసురెడ్డి కామేశ్వరమ్మ, మన్నెం శేషిరెడ్డి, బానోతు అలీ, చాట్ల రామకృష్ణ, గోలి శ్రీనివాస్, పులిపాటి నర్సింహారావు, కండె వెంకటేశ్వర్లు, ఎక్స్‌అఫిషియో మెంబర్ తూమాటి శ్రీనివాసాచార్యులు, ఈఓ సిరికొండ నవీన్ ఉన్నారు.

# 3 గంటల కాంగ్రెస్సా.. 24 గంటల బీఆర్ఎస్సా

- ఎన్ని గంటల కరెంట్ కావాలో ప్రజలు ఆలోచించాలి
- అభివృద్ధి చేసే బీఆర్ఎస్‌ను ఆశీర్వదించాలి
- ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్
- పెన్‌పహాడ్‌లో ఎన్నికల ప్రచారం



దోసపహాడ్ ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎంపీ బడుగులు లింగయ్యయాదవ్

పెన్‌పహాడ్, నవంబర్ 25 : కాంగ్రెస్ ఇస్తామంటున్న 3 గంటల కరెంట్ కావాలా ? లేక బీఆర్ఎస్ ప్రభుత్వం అందిస్తున్న 24 గంటల కరెంట్ కావాలా ? ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. శనివారం మండలంలోని అనాజిపురం, దోసపహడ్ గ్రామాల్లో బీఆర్ఎస్ సూర్యాపేట అభ్యర్థి, మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించి మాట్లాడారు. వృద్ధులకు, దివ్యాంగుల ఆత్మ గౌరవాన్ని పెంచిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దే అన్నారు. అలాగే రైతులు, మహిళలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి రైతు బాంధవుడిగా చరిత్రలో నిలిచిపోయినట్లు తెలిపారు. మంత్రి జగదీశ్‌రెడ్డి సూర్యాపేట నియోజక వర్గాన్ని రాష్ట్రంలోనే నంబర్ వన్ పట్టణంగా తీర్చిదిద్దుతున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రజల సంక్షేమాన్ని కాంక్షించి సీఎం కేసీఆర్ ఇప్పటికే కొనసాగిస్తున్న పథకాలకు తోడుగా మరో 10 పథకాలను మ్యానిఫెస్టో ద్వారా ప్రకటించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటు వేసి మంత్రి జగదీశ్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఒంటెద్దు నర్సింహారెడ్డి, ఎంపీపీ నెమ్మాది భిక్షం, జడ్పీటీసీ మామిడి అనితాఅంజయ్య, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దొంగరి యుగేందర్, సర్పంచులు చెన్ను శ్రీనివాస్‌రెడ్డి, దొంగరి సుధాకర్, పీఏసీఎస్ చైర్మన్లు వెన్న సీతారాంరెడ్డి, జానకిరామ్‌రెడ్డి, నరసయ్య పాల్గొన్నారు.




## రాష్ట్ర స్థాయి పోటీలకు చివ్వెంల గురుకుల విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ పుండరికాచారి

చివ్వెంల, నవంబర్ 25 : చివ్వెంల మండలానికి చెందిన ఎస్సీ గురుకుల విద్యార్థులు రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్, ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పుండరికాచారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20న నల్లగొండలో గల మేకల అభినవ్ స్టేడియంలో జరిగిన అండర్-14 విభాగంలో 8వ తరగతికి చెందిన ఆర్.సాయికుమార్, అండర్-17 విభాగంలో ఇంటర్ ఫస్టియర్ విద్యార్థి ఎం.అఖిల్ రాష్ట్ర స్థాయి హాండ్‌బాల్ పోటీలకు, జడ్పీహెచ్ఎస్ నడిగూడెంలో జరిగిన ఫుట్‌బాల్ పోటీల్లో అండర్-17 విభాగంలో, 9వ తరగతికి చెందిన ఎం.గౌతమ్ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు వెల్లడించారు. వైస్ ప్రిన్సిపాల్ బి.యాదయ్య, పీఈటీలు అభినందనలు తెలిపారు.

# రైతు బంధు సాయం@13వేల కోట్లు

- 12వ సారి పంపిణీకి రంగం సిద్ధం
- పెట్టుబడి సాయం పంపిణీకి ఓకే చెప్పిన ఈసీ
- రైతాంగంలో హర్షాతిరేకాలు

నల్లగొండ ప్రతినిధి, నవంబర్25 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కునారిల్లిన వ్యవసాయాన్ని గాడిలో పెట్టేందుకు స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ సాగునీటి ప్రాజెక్టులు నిర్మించి 24గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నారు. ఇక వీటికి తోడు రైతన్నను సాగుమడిలో ముందుకు నడిపించేందుకు పెట్టుబడి సాయం కోసం ఆలోచించారు. దానికి రైతుబంధు అని పేరు పెట్టి 2018 వానాకాలం సీజన్ నుంచి ఎకరానికి నాలుగు వేల చొప్పున ఏడాదికి రెండుసార్లు పెట్టుబడి సాయం అందించడం మొదలుపెట్టారు. 2018 డిసెంబర్‌లో రెండోసారి అధికారంలోకి రాగానే వానాకాలం నుంచి ఎకరానికి ఐదు వేల చొప్పున ఏడాదిలో రెండు సీజన్లకు కలిపి 10వేల రూపాయల సాయాన్ని అందిస్తూ వస్తున్నారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఎన్నడూ కూడా రైతుబంధు ఆగలేదు. సీజన్ ప్రారంభం అవుతుందంటే చాలు... పెట్టుబడికి ఇబ్బందులు లేకుండా నేరుగా రైతుల ఖాతాల్లోకే నగదు బదిలీ చేస్తున్నారు. ఇలా వానాకాలంలో జూన్, జూలైల్లో, యాసంగిలో నవంబర్, డిసెంబర్ మాసాల్లో క్రమం తప్పకుండా రైతుబంధు డబ్బులు ఒక్క పైసా లంచం లేకుండా రైతులకే చెందుతున్నాయి. సీజన్ సీజన్‌కు కొత్తగా పాసుపుస్తకాలు పొందిన రైతులకు సైతం పెట్టుబడి సాయం అందజేస్తున్నారు. ప్రస్తుత యా సంగి సీజన్‌లో సైతం రైతుబంధు డబ్బులు పంపిణీకి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఎన్నికల పేరుతో రైతు వ్యవసాయం ఆగద్దని ప్రత్యేకంగా ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేసి అనుమతి సాధించింది.

### ఎల్లుండి నుంచి షురూ...

ఎన్నికల సంఘం అనుమతించినా ఇవ్వాళ, రేపు ప్రభుత్వ సెలవు దినాలు ఉండడంతో పంపిణీకి ఆటంకంగా మారింది. దీంతో మంగళవారం నుంచి రైతుబంధు డబ్బుల పంపిణీ షురూ కానుంది. ఎప్పటిలాగే రైతుల ఖాతాల్లో తొలిరోజూ ఎకరం నుంచి మొదలుకుని భూవిస్తీర్ణంతో సంబంధం లేకుండా దశలవారీగా వారం పది రోజుల్లో రైతులందరికీ రైతుబంధు నగదు జమకానుంది. తొలి రోజూ ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 3.20లక్షల మంది రైతులకు సంబంధించిన రెండు లక్షల ఎకరాలకు పెట్టుబడి సాయంగా సుమారు రూ.100కోట్ల వరకు రైతులకు అందనున్నట్లు అంచనా.

ఇలా భూవిస్తీర్ణంతో సంబంధం లేకుం డా పట్టాదారు పాసుపుస్తకం ఉన్న చివరి రైతు వరకు రైతుబంధు డబ్బులు ఖాతాల్లో జమకానున్నాయి. ఇక మూడోసారి బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే రైతుబంధు సాయం దశలవారీగా ఏడాదికి 16వేల రూపాయలకు పెంచనున్నట్లు ఇప్పటికే కేసీఆర్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో రైతులకు మరింత ప్రయోజనం చేకూరనుంది.

### 12 విడుతల్లో రూ.13,000 కోట్లు

రాష్ట్రంలోనే రైతుబంధు ద్వారా అత్యధిక ప్రయోజనం పొందే జిల్లా ఉమ్మడి నల్లగొండనే. సీజన్ సీజన్‌కు ఈ సంఖ్య భారీగా పెరుగుతూ వస్తోంది. పథకం ప్రారంభం అయిన నాటి నుంచి మొత్తం 11 సీజన్లలో నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లో కలిపి మొత్తం రూ.11,700 కోట్ల వరకు రైతులకు పెట్టుబడి సాయంగా అందింది. ప్రస్తుత యాసంగిలో మరో 1300 కోట్ల రూపాయలు రైతులకు చేరనున్నాయి. మొత్తంగా 12 విడతల్లో కలిపి సుమారు 13వేల కోట్ల రూపాయలు ఉమ్మడి జిల్లా రైతాంగానికి చెందనున్నాయి. ఇన్ని కోట్ల రూపాయల్లోనే ఒక్క రూపాయి పక్కదారి పట్టకుండా ప్రతీ పైసా నేరుగా రైతుకే చెందేలా అత్యంత పకడ్బందీగా పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. ఒక్క రూపాయి కూడా ఎవ్వరికీ లంచం ఇవ్వకుండా నేరుగా రైతులకే చెందుతున్నాయంటే అందుకు ప్రభుత్వం పాటిస్తున్న పారదర్శకత, చిత్తశుద్ధినే కారణం. గతంలో సమైఖ్య పాలనలో ఏ ప్రభుత్వ పథకంలోనైనా 20 నుంచి 30శాతం వరకు నిధులు దళారుల, అక్రమార్కుల జేబుల్లోకే చేరేవన్నది కాదనలేని సత్యం.

### 11లక్షల మందికిడ..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 11లక్షల మంది పైచిలుకు రైతులకు ప్రస్తుత యాసంగిలో పెట్టుబడి సాయం అందనుంది. పెట్టుబడి సాయంగా మొత్తం 1300కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో జమకానున్నాయి. 2022 యాసంగిలో పెట్టుబడి సాయం పొందిన రైతుల సంఖ్య 10.81లక్షలుగా ఉంది. ఈ ఏడాది వానాకాలంలో అది 11 లక్షల దరిదాపుల్లోకి చేరింది. ప్రస్తుతం సీజన్‌లో రైతుల సంఖ్య 11 లక్షలు దాటనుందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. నల్లగొండ జిల్లాలో 5.30 లక్షలు, సూర్యాపేట జిల్లాలో 3.10లక్షలు, యాదాద్రి జిల్లాలో 2.71లక్షల మంది రైతులు అర్హులుగా అంచనా. ఈ సీజన్‌లో పోడు రైతులతో పాటు కొత్తగా పాసుపుస్తకాలు పొందిన రైతుల వివరాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉన్నట్లు చెబుతున్నారు. వీరికి కూడా ఈ ధపాలో రైతుబంధు అందించనున్నారు.